విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 22, మే 2025

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు : దేశ వ్యాప్తంగా ఉన్న ఆటో కార్మికులకు ప్రభుత్వాలు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారి అభివృద్ధి కృషి చేయాలని ఏఐటియుసి నంద్యాల జిల్లా అధ్యక్షులు వి.రఘురాంమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణం నందు ఏపీ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ కొత్త బస్టాండ్ శాఖ ఆధ్వర్యంలో నంద్యాల రోడ్డులోని నందు బైపాస్ సర్కిల్ నందు ప్రజల సౌకర్యం కోసం నూతన ఆటో స్టాండ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు వీ.రఘురాంమూర్తి జెండా ఆవిష్కరించారు. అనంతరం రఘురామ మూర్తి సిపిఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్టీసీ తర్వాత అతిపెద్ద రవాణా రంగం ఆటోరంగమన్నారు. ఆటో రంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమగా గుర్తించి దేశవ్యాప్తంగా ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. 55సంవత్సరాలు దాటిన ఆటో కార్మికులకు సామాజిక పింఛను రూ.6వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మోటార్ వెహికల్ యాక్ట్ చట్టాన్ని రద్దు చేయాలని ఆటోలపై అధిక జరిమాణాలు విధించే జీవో నెంబర్ 21ని రద్దు చేయాలన్నారు. ఆటో యూనియన్ నాయకులు కె.నాగేంద్ర మాలిక్, నాగేశ్వరరావు, నాగరాజు, శేషాద్రి గౌడ్, ప్రవీణ్, శ్యామ్ రాజ్ చింటూ ఏసన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ పరిశ్రమలపై

ఉద్యమమే

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : సిమెంట్ పరిశ్రమ యజమాన్యాలు రైతులకు న్యాయం చేయకుంటే ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏఐకేఎస్) నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం నందు నంద్యాల జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, ఏఐకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, మండల కార్యదర్శి పుల్లయ్య తదితరులతో కలిసి ఆయన రాంకో బాధిత రైతుల సమస్యలపై తాసిల్దార్‌తో చర్చించారు. రాంకో ప్రతినిధులు బుధవారం చర్చలకు వస్తామని చెప్పి రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాంకో చుట్టుపక్కల పంటలు సాగు చేస్తున్న రైతన్నలు గత ఆరు సంవత్సరాలుగా తీవ్రంగా నష్టపోతున్నారని యజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాంకో కాలుష్యము వలన నష్టపోతున్న ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించాల్సిందేనని లేకుంటే ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. జూన్ రెండో తేదీన రాంకో ప్రతినిధులు బాధిత రైతుల సమస్యలపై చర్చలకు భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. తాసిల్దార్ చర్చలకు పిలిచిన రాంకో ప్రతినిధులు గైర్హజరు కావడంపై మండిపడ్డారు. రాంకో చుట్టుపక్కల కాలుష్యంతో 300 ఎకరాలలో రైతులు పంటలు సాగు చేసి నష్టపోతున్నారని జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. 21వ తేదీన చర్చలకు రమ్మంటే తామంతా రైతులతో కలిసి వచ్చామని రాంకో ప్రతినిధులు రాకపోవడంపై మండిపడ్డారు. 2019 సంవత్సరం నుండి రాంకో యజమాన్యం కాలుష్యంతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయకుంటే పెద్ద ఎత్తున పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు.

ట్రాఫిక్ నియంత్రణ జరిగేనా..?



విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. ప్రధాన రహదారి వెంట రెండు వాహనాలు వెళ్లాల్సిన చోట ఒక్క వాహనం కూడా వెళ్ళలేని పరిస్థితుల్లో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం వ్యాపారస్తులు తమ దుకాణాలను ముందుకు వచ్చి రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మించుకోవడం వల్లనే రహదారులు ఇరుకుగా తయారవుతున్నాయి. దానికి తోడు షాపుల ముందు మోటారు వెహికల్స్ నిలుపుకోవడం వల్ల రోడ్డు పూర్తిగా ఇరుకుగా తయారై భారీ వాహనం వస్తే ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయి. పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి గ్రామములోకి వెళ్లే ప్రధాన రహదారి పూర్తి ఇరుకుగా తయారవుతున్నది. ప్రధాన రహదారి ఇరువైపులా బంకులు డ్రైనేజీ కాలువలపై, రోడ్డు స్థలాలను ఆక్రమించుకొని వేసుకోవడం వల్ల రహదారి ఇరుకుగా తయారవుతుంది. తరచుగా ట్రాఫిక్ జామ్ కావడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం సంత మార్కెట్ ఉన్న రోజైతే ట్రాఫిక్ జామ్ ఇంకా ఎక్కువగా ఉంటుంది. ట్రాఫిక్ నియంత్రణపై పోలీసు అధికారులు కానీ, స్థలాలను ఆక్రమించుకొని నిర్మించుకున్న వాటిపై పంచాయతీ అధికారులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోక నిర్లక్ష్యం వహించడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నా అన్నది జగమేరుగని సత్యం. ఇప్పటికైనా అధికారులు ట్రాఫిక్ నియంత్రణపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

చరిత్ర అంటే కోట్ల కుటుంబానిదే

విశాలాంధ్ర - డోన్ రూరల్: చరిత్ర అంటే కోట్ల కుటుంబానిదే అని వలసల రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో అవినీతి గురించి మాట్లాడితే వైసీపీ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని అన్నారు. బేతంచర్ల, డోన్,ప్యాపిలి జగనన్న కాలనీలలో భారీ అవినీతి జరిగిందని ప్రజలకు ఇచ్చిన స్థలాలలో ఏ ఒక్కటి కూడా నివాసయోగ్యంగా లేవని తెలిపారు.

కట్టడాల వల్ల ఉపయోగం లేదు : వైసిపి ప్రభుత్వ హయంలో కట్టిన కట్టడాల వల్ల ప్రజలకు ఉపయోగం లేకుండా పోయిందని టిడిపి నాయకుడు మున్సిపల్ వైస్ చైర్మన్ కో ట్రీకే హరి కిషన్ తెలిపారు. మోషే ఆర్థిక మంత్రి బుగ్గన పాతపేటను నిర్వీర్యం చేశారని అన్నారు. పాతపేటలోని పీహెచ్‌యు సెంటర్ వలన ఎవరికి ఉపయోగం లేకుండా ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీర్ అయ్యిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేషి రెడ్డి,పెద్ద కేశవయ్య గౌడ్, శేషఫని గౌడ్,దస్తగిరి, శ్రీరాములు,చంద్రన్న, తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల కోసం రిజిస్టర్ చేసుకోండి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో పచ్చి రొట్ట ఎరువుగా జీలగ విత్తనాలు రైతులందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో కేజీ 61.50 పైసలుతో ఎకరాకు 10 కేజీల చొప్పున గరిష్టంగా ఐదు ఎకరాలకు 50 కేజీలు ఆయన అన్నారు. వరి వేసే రైతులు తప్పనిసరిగా జీలగ విత్తనాలను కొనుగోలు చేసి పచ్చి రొట్టెరువుగా సాగు చేసి భూమిని సారవంతం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించండి

విశాలాంధ్ర - మిడుతూరు : ప్రభుత్వము నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని ఎంపీడీవో దశరథ రామయ్య అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఫారం ఫండ్ పనులను విరివిగా చేపట్టి భూగర్భ జలాలను పెంపొందించుకోవాలన్నారు. రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోజుకు 4000 మంది శ్రామికులకు పని కల్పించాలని ఆదేశించారు. ఉపాధి కూలికి దినసరి వేతనం రూ.307 వచ్చేలా పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నాగమ్మ ,ఇంజనీర్ కన్సల్టెంట్ షబానా, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి బాక్సింగ్ సెలక్షన్స్

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : ఆత్మకూరులోని కేవీకే స్టేడియంలో మొదటిసారిగా అండర్ 17జూనియర్ జిల్లాస్థాయి బాలబాలికల బాక్సింగ్ సెలక్షన్స్ జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాక్సింగ్ లీగల్ అడ్వైసర్ ఆలి హుస్సేన్, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా, వాలీబాల్ కోచ్ రైల్వే కృష్ణ పాల్ లు హాజరై మాట్లాడుతూ జిల్లాస్థాయిలో వచ్చిన క్రీడాకారులకు బాక్సింగ్ పోటీలు పెట్టారు. విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ చదువుతో పాటు క్రీడలను ఆడాలన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపితే రాబోయే రోజుల్లో గర్వించదగ్గ ఉద్యోగాలు పొందవచ్చని అన్నారు. సెలక్షన్స్‌లో జిల్లా నుంచి పాల్గొన్న వారిలో 7మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారందరూ ఈనెల 28, 29వ తేదీలలో విశాఖపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ సెలక్షన్స్‌కి హాజరవుతారాన్నారు. క్రీడాకారులకు స్టేడియంలో అన్ని విధాలా సౌకర్యాలు కల్పించి సహకరిస్తున్న శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు స్టేడియం బాక్సింగ్ శిక్షకులు ఉపేంద్ర, ఖోఖో శిక్షకులు మహేబూబ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - నంద్యాల రూరల్: నంద్యాల మండల పరిధిలోని అయ్యలూరు గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎస్ డిపిఐ గ్రామ ప్రెసిడెంట్ హబీబుల్లా తెలిపారు. బుధవారం అయ్యలూరు గ్రామపంచాయతీ పరిధిలోని కరెంట్ పోల్, ట్రాన్స్ఫార్మర్ కు సంబంధించి ఏర్పడిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ట్రాన్స్కో ఏఈ శ్రీనివాసులకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో గత పది రోజుల నుంచి ట్రాన్స్ఫార్మర్, కరెంటు స్తంభాలు సరిగా లేకపోవడం వల్ల గ్రామంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతోపాటు ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామంలో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారని వారన్నారు. విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజి నీర్ శ్రీనివాసులు మాట్లాడుతూ తప్పనిసరిగా ఐలూరు గ్రామంలో స్తంభాలు కృంగిన చోట కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి అలాగే ట్రాన్స్ఫార్మర్లు మరమ్మతులు చేపడతామని ఏఈ గ్రామస్తులకు తెలియజేశారు.

చెరువులకు మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులు చేపట్టండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జిల్లాలో ఉన్న చిన్న నీటిపారుదల చెరువులకు మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రిపేర్స్, రెనోవేషన్, రెస్టోరేషన్ (ఆర్‌ఆర్‌ఆర్) స్కీమ్ పై మైనర్ ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇరిగేషన్ శాఖ ఎస్ఈ శివప్రసాద్ రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర ప్రసాద్, పరిశ్రమల శాఖ జిఎం జవహర్ బాబు, భూగర్భ జల డిప్యూటీ డైరెక్టర్ రఘునాథ్, డ్వామా పిడి వెంకటసుబ్బయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ చిన్న నీటిపారుదల చెరువులకు మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2005లో ఆర్‌ఆర్‌ఆర్ స్కీమ్ ను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. అందుకు ముందుగా జిల్లాలో మరమ్మత్తు, పునరుద్ధరణ చేయాల్సిన ట్యాంకులను గుర్తించి ఎకరాకు లక్ష రూపాయలు మించకుండా ఖర్చు చేయాలన్నారు. జిల్లాలో ఉన్న 116 ఇరిగేషన్ చెరువులకు సంబంధించి 91 ట్యాంకుల మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులు గుర్తించి ప్రతిపాదలను సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ స్కీమ్ ద్వారా రాష్ట్ర నిధుల నుండి 40 శాతం ఖర్చు చేస్తే 60 శాతం నిధులు కేంద్రం నుండి నిధులు మంజూరు అవుతాయన్నారు.

రేషన్ కార్డు మంజూరుకు షరతులు ఎత్తివేయాలి

షరతుల వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజానీకం

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రేషన్ కార్డు మంజూరుకు షరతులు ఎత్తివేయాలనీ, షరతుల వల్ల ప్రజానీకం ఇబ్బంది పడుతున్నారని ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు పేర్కొన్నారు. బుధవారం సిపిఐ నంద్యాల జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాగరాముడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వము చేపట్టిన రేషన్ కార్డుల తొలగింపు, చేర్పింపు కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం పెట్టిన షరతులు వల్ల ప్రజానికం చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని, ఈ షరతుల వల్ల వెబ్ సైట్లు సక్రమంగా పనిచేయక, సర్వర్లు సరిగా పనిచేయక అడిగిన ఆప్షన్ తీసుకునే లోపే ఇంకో ఆప్షన్ అడగడం, సర్వర్లు బిజీగా రావడం తదితర సమస్యల వల్ల ప్రజానికం తీవ్రంగా ఇబ్బందులకు గురై అప్లై చేయడానికి వెళ్ళిన సమయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నెట్ సెంటర్ల వద్ద పడికాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, అంతేకాకుండా కొత్తగా రేషన్ కార్డులకు అప్లై చేసుకున్న వారికి పెళ్లయితే వివాహ ధ్రువీకరణ పత్రం కంపల్సరీ కావడం వల్ల కూడా చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎటువంటి షరతులు లేకుండా అప్లై చేసుకుని రేషన్ కార్డులను పొందేందుకు అవకాశం కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నంద్యాల పట్టణ నాయకులు అంజి, శరత్, రవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో సభ్యత్వం.. ఇరిగెలకే సాధ్యం

విశాలాంధ్ర - శిరివెళ్ల : ఉమ్మడి కర్నూలు జిల్లాలో జనసేన పార్టీ సభ్యత్వం నమోదులో రాయలసీమ సీనియర్ పొలిటికల్ లీడర్ ఇరిగెల రాంపుల్లారెడ్డి సారథ్యంలో రికార్డ్ స్థాయిలో సభ్యత్వం జరిగినట్లు శిరివెళ్ల జనసేన పార్టీ నేత పెసరాయి చాంద్ భాష పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శిరివెళ్ల మేట్ట వద్ద జనసైనికుల కోలాహలం మధ్య బుధవారం జనసేన పార్టీ సభ్యత్వం కార్డుల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల జనసేన పార్టీ ఇన్చార్జి ఇరిగేల ప్రతాపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సభ్యత్వం కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇరిగెల ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ గారి సారథ్యంలో జనసేన పార్టీ ప్రవేశపెట్టిన బీమా సౌకర్యం జనసైనికులకు ఒక ధీమాగా ఉందని అన్నారు. జనసేన పార్టీ 12 ఏళ్ల ఆవిర్భావం తర్వాత ఉమ్మడి కర్నూలు జిల్లా 14నియోజకవర్గాల్లో అత్యధిక పార్టీ సభ్యత్వాలు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో జరగడం ఇరిగెల బ్రదర్స్‌కే సాధ్యం అయ్యిందని అన్నారు. సభ్యత్వం కార్డుల నమోదుకు సహకరించిన ప్రతిఒక్క జనసైనికులకు ఇరిగేల ప్రతాపరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శిరివెళ్ల మండల జనసేన పార్టీ నాయకులు పసుల నరేంద్ర, తలారి పెద్ద బాలయ్య, కోటపాడు మాజీ సర్పంచ్ ఆర్ ఓబుల కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొల్లి నాగేశ్వరావు ఆశయాలను సాధిస్తాం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల సీపీఐ కార్యాలయంలో అఖిల భారత కిసాన్ సభ మాజీ ఉపాధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫక్రుద్దీన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.భాస్కర్, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితాంతం రైతుల సంక్షేమం, హక్కుల కోసం పోరాడిన కమ్యూనిస్టు నాయకుడు కొల్లి నాగేశ్వరరావు అని, పోలవరం ప్రాజెక్టుకు కొల్లి నాగేశ్వరరావు ఎంతో కృషి చేశారన్నారు. సుదీర్ఘకాలం జిల్లా పార్టీ కార్యదర్శిగా, రాష్ట్ర పార్టీ కార్యవర్గసభ్యునిగా పనిచేసి అనేక ప్రజా ఉద్యమాలలో ప్రముఖ పాత్ర వహించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఏ వెంకటేశ్వర్లు, రాముడు, మహిళ నాయకురాలు సాలమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

వసుధ ఫౌండేషన్ సేవలు వెల కట్టలేనివి

విశాలాంధ్ర - బనగానపల్లె: వసుధ ఫౌండేషన్ వారి సేవలు విలువ కట్టలేనివని బీసీ ఇందిరా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు వసుధ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మంతెన వెంకట రామరాజు సౌజన్యంతో పెండేకంటి రమణ కుమార్ సహకారంతో తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షులు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి సీనయ్య ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న 12మందికి లక్ష రూపాయలు విలువగల చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి, అర్బన్ సీఐ ప్రవీణ్ కుమార్, రులర్ సీఐ మంజునాథ్ రెడ్డి హాజరై చెక్కులు పంపిణీ చేశారు. ముందుగా భారత్ పాకుల మధ్య జరిగిన యుద్ధంలో అమరుడైన మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కాసింబాబు, పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌలిశ్వర్,టీచర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

యోగాను దినచర్యలో భాగస్వామ్యం చేసుకోండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ప్రతి ఒక్కరూ యోగాని నిత్యజీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని, ప్రభుత్వం నిర్దేశించిన యోగాంధ్ర కార్యక్రమాల్లో జిల్లా యంత్రాంగం, ప్రజలు విస్తృతంగా పాలు పంచుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం నంద్యాల పట్టణం ఇండోర్ స్టేడియంలో 11వ అంతర్జాతీయ యోగా దిన మాసోత్సవ ప్రారంభ వేడుక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డిఆర్వో రామునాయక్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, జిల్లా అధికారులు, వివిధ యోగ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ యోగాను రోజు వారి దిన చర్యలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం చేసుకోవడం వల్ల శారీరకంగా, మానసికంగా, ఉల్లాసంగా, జీవితంలో ఎలాంటి ఒత్తిళ్లకు గురి కాకుండా వుండేందుకు యోగ సాధన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు మే 21వ తేది నుండి జూన్ 21వరకు నెల రోజుల పాటు యోగాంధ్ర - 2025 కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని, ఇందులో భాగంగా మొదటి వారంలో జిల్లా, మున్సిపల్, మండల, గ్రామ స్థాయిలో యోగాలో తర్ఫీదు పొందిన వారిని రిసోర్స్ పర్సన్‌గా తీర్చిదిద్ది వారి ద్వారా ఈ నెల 28వ తేది నుండి వారం రోజులు మండల, గ్రామ స్థాయిలో యోగపై అవగాహన కల్పించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ జిల్లా అధికారి డా.యశోధర, డీఈఓ జనార్దనరెడ్డి, డ్వామా పిడి వెంకటసుబ్బయ్య, డిఎస్డిఓ రాజు, ఆయుష్ డాక్టర్లు, వివిధ శాఖల అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వేప చెట్టుపై పిడుగు

విశాలాంధ్ర - పాములపాడు : పిడుగుపాటుకు వేపచెట్టు చీలి విద్యుత్ స్తంబాల ఇన్సులేటర్లు దెబ్బతిన్న సంఘటన మండలం కేంద్రమైన పాములపాడులోని మోడల్ స్కూల్ సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు బుధవారం ఉరుములు మెరుపులతో వర్షం కురుస్తున్న సమయంలో పెద్ద శబ్దాలు రావడంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు, రైతులు పొలాల వైపు వెళ్లి చూడగాఏపీ మోడల్ స్కూల్ సమీపంలో వేప చెట్టుపై పిడుగు పడింది వేప చెట్టు కొమ్మలు చిలాయి, పిడుగు పడిన సమయంలో పొలాల వైపు ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు కానీ, విద్యుత్ స్తంభాల ఇన్సులేటర్లు బాగా దెబ్బతినడంతో సాయంత్రం వరకు పాములపాడు, మిట్టకందాల, చెలిమిళ్ళ, లింగాల, రుద్రవరం, తుమ్మలూరు, జూటూరు తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన విద్యుత్ అధికారులు విద్యుత్ స్తంభాలాంబడి తిరిగి ఇన్సులేటర్లు మార్చి విద్యుత్ సప్లైను పునరుద్ధరించారు. విద్యుత్ సప్లై కావడంతో రైతులు గ్రామస్తులు విద్యుత్ అధికారులపై హర్షం వ్యక్త చేశారు.

ఆర్.ఒ.సి.నెం : 301/2015/ఎ1

పురపాలక సంఘము, నంద్యాల
తేది : 21.05.2025.

పత్రిక ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా 2025-26 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి నంద్యాల పురపాలక సంఘము ఆధీనంనందు షాపింగ్ కాంప్లెక్స్ లలోని ఖాళీగా వున్న షాపు రూములను తేది : 28-05-2025 ఉదయం 11.30 గం॥లకు వేలం పాటలు నిర్వహించబడునని తెలయజేయడమైనది.

వేలములు నిర్వహిందు మునిసిపల్ షాపు రూముల వివరములు:

వ. సం	షాపింగ్ కాంప్లెక్స్ పేరు	షాపు రూము నెం
1	పాత మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్	01,08,1N(FF), 4N-5N(FF), 6N-7N(FF), 8N-9N(FF)
2	మునిసిపల్ హైస్కూలు దగ్గర	8(FF-ST), 11-12(FF)
3	ఆర్.ఎఫ్.రోడ్	1.2.3
4	సత్రంబడి	01, 05(FF), 06(FF)
5	గర్ల్స్ హైస్కూల్ ప్రక్కన	03, 04, 08(FF), 09(FF)
6	ఆర్.టి.సి బస్టాండ్	05 (SC)
7	డైల్ విజిబుల్ మార్కెట్	10

సదరు బహిరంగ వేలమునందు పాల్గొనదలచిన వారు ఇతర వివరముల కొరకు మునిసిపల్ కార్యాలయములోని రెవెన్యు విభాగము వందలి ఎ1 గుమాస్తామ కార్యాలయపు పని వేళలలో సంప్రదించగలరు మరియు పాటలో పాల్గొనదలచినవారు పాటకు 3 రోజుల ముందుగా సాల్వెన్సీని కార్యాలయములోని ఏ1 గుమాస్తాకు అందరియవలసినదిగా తెలియజేయడమైనది.

కమీషనరు,
నంద్యాల పురపాలక సంఘము.

లాభనష్టాల ఆలోచన లేకుండా పనిచేస్తున్నాం

ప్రముఖ శిల్పి, జాతీయ అవార్డు గ్రహీత
దురుగడ్డ హరిప్రసాద్ ఆచారి..

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : అశోకుని సింహ స్తంభం కేవలం ఒక కళాఖండం మాత్రమే కాదని భారతదేశ చరిత్ర, సంస్కృతి మరియు ధర్మం యొక్క గొప్ప చిహ్నమని ప్రముఖ శిల్పి, శిలా కృతి శిల్పుల ప్రాజెక్టు వ్యవస్థాపకులు, జాతీయ అవార్డు గ్రహీత దురుగడ్డ హరి ప్రసాద్ ఆచారి పేర్కొన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని శిలాకృతి స్టూడియో ప్రాంగణంలో బుధవారం అశోక స్తంభం ప్రాజెక్టు నూతన ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని అశోక స్తంభ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశోక స్తంభం మన గొప్ప వారసత్వ సంపదకు ఒక ప్రతీకగా నిలుస్తూ రాబోయే తరాలకు స్ఫూర్తినిస్తుందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ ఆదరించి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. క్రీస్తు శకం 3వ శతాబ్దంలోనే అశోక స్తంభాన్ని నాటి అశోక చక్రవర్తి స్థాపించడం జరిగిందన్నారు. అశోక స్థూపాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన సూచించారు. ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ జి.ఉషారాణి మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలో ఇంతటి గొప్ప ప్రాజెక్టు ఏర్పాటు జరగడం నిజంగా ఆళ్లగడ్డకు ఎంతో గర్వకారణం అని ఉషారాణి ప్రశంసించారు. శారద శిల్పకళా మందిరం వ్యవస్థాపకులు దురుగడ్డ రవీంద్రాచారి మాట్లాడుతూ తమ సోదరుడు హరిప్రసాద్ మామూలు శిల్పకళలకు భిన్నంగా శిలా కృతి శిల్పకళా ప్రాజెక్టును ఆళ్లగడ్డలో స్థాపించడం జరిగిందన్నారు. ఈ రోజు ఎంతో సుదినం అని, అశోక స్థూపం ఆవిష్కరణ ద్వారా ఆళ్లగడ్డ శిల్పకళా ఖ్యాతి మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఉషారాణి ఆధ్వర్యంలో హరిప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శిలాకృతి ప్రాజెక్టు మేనేజర్ మాధవ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గంగన్న, అవోపా నాయకులు వెంకటసుబ్బయ్య, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు పద్మ, అనసూయ, దురుగడ్డ అనురాధ, కాళికామాత ఆలయ కమిటీ సభ్యురాలు దురుగడ్డ సావిత్రమ్మ, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

విస్తరణకు తీసిన గుంతలో మోటార్ సైకిల్

విశాలాంధ్ర - రుద్రవరం : మండల కేంద్రం నుంచి నరసాపురం వైపు రోడ్డు విస్తరణలో భాగంగా ఇటీవల తీసిన గుంతలో మోటార్ సైకిల్ పడి ఇద్దరు యువకులకు గాయాలు అయ్యాయి. గ్రామస్తులు వివరాల మేరకు బుధవారం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిన్న, ఓబులేసు అనే యువకులు మోటార్ సైకిల్ పై రుద్రవరం వస్తుండగా పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు విస్తరణకు తీసిన గుంతలో మోటార్ సైకిల్ తో పాటు ప్రమాదవశాత్తుపడి గాయపడ్డారు. దీంతో వీరిని స్థానికులు బయటకు తీసి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు.

గంగమ్మ జాతరలో మాజీ ఎమ్మెల్సీలు

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : మండలంలోని పెద్దయేమునూరు గ్రామంలో సోమవారం మంగళవారం రెండు రోజులపాటు గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు గ్రామంలో గంగమ్మ చౌడేశ్వరి అంకాలమ్మ దేవాలయాలు నూతనంగా నిర్మించారు. ఈ సందర్భంగా గ్రామంలో రెండు రోజులపాటు గంగజాతర గ్రామం కలిసి ఐకమత్యంగా జరుపుకున్నారు. సోమవారం సౌడేశ్వరి అమ్మవారికి జోతుల కార్యక్రమం నిర్వాహించారు. మంగళవారం ఇంటింటికి బోనాలు అమ్మవారికి సమర్పించారు. గ్రామంలోని గంగిరెడ్డి వెంకటేశ్వరెడ్డి కుటుంబం ఆహ్వానం మేరకు ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకరరెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్సీ, చల్లా శ్రీలక్ష్మి, పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

రైతు బాంధవుడు కొల్లి నాగేశ్వరరావు : కె.జగన్నాథం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కామ్రేడ్ కొల్లి నాగేశ్వర రావు రైతుబాంధవుడని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం కొనియాడారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏఐకేఎస్ నాయకులు కొల్లి నాగేశ్వరరావు 5వ వర్ధంతి సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కార్యదర్శి ఎస్.మునెప్పలు హాజరై చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ కొల్లి నాగేశ్వరరావు ఏఐఎస్ఎఫ్ నాయకులుగా కృష్ణా జిల్లా సీపీఐ కార్యదర్శిగా, ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులుగా పని చేశారన్నారు. రైతుల పక్షాన నిరంతరం పోరాడే కష్టజీవి అన్నారు. బీటీ పత్తి విత్తనాలు తగ్గించాలని సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసి రైతులకు కోట్లాది రూపాయల డబ్బులు ఆదా చేశార న్నారు. గోదావరి జలాలను మళ్ళిం చాలని పోలవరం ప్రాజెక్టు నిర్మించాలని, రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని పోరాటం చేసిన మహావ్యక్తి అన్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం పైన వత్తిడి తీసుకు వచ్చేందుకు అనేక ఉద్యమాలు చేశారన్నారు. రాయలసీమలో కరువు వచ్చిన సందర్భంగా రాయలసీమ జిల్లాలు పర్యటించారు రాయల సీమలో శాశ్వత కరువు నివారణకు రాయల సీమలోనే ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రభుత్వం పైన వచ్చి తీసుకు వచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి సి.మహేష్, రాముడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, మహిళా సమాఖ్య నాయకురాలు రబియా తదితరులు పాల్గొన్నారు.

అందరి జీవితాల్లో యోగా భాగం కావాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : యోగా అందరి జీవితాల్లో భాగం కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. బుధవారం నగరంలోని ఇండోర్ స్టేడియంలో యోగాంధ్ర క్యాంపెయిన్‌కు శ్రీకారం చుడుతూ కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, అధి కారులు పాల్గొన్నారు. యోగా శిక్షకులచే యోగాస నాలు అభ్యాసం చేయించారు. జిల్లా కలెక్టర్, నగర మేయర్, ఎస్పీ, ఇతర అధికారులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 69వ సమావేశంలో 2014 సెప్టెంబర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జూన్ 21వ తేదీన అంతర్జాతీయ దినోత్సవం జరపాల్సిందిగా ప్రతిపాదించారని, ఈ ప్రతి పాదనను 177 దేశాలు ఆమోదించడం జరిగిందన్నారు. 2015 నుండి ప్రతి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు యోగా వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై ఈ రోజు నుంచి నెలరోజులపాటు విస్తృతంగా అవగాహన కల్పిస్తామని జిల్లా కలెక్టర్ అన్నారు. జూన్ 21న వైజాగ్‌లో 5 లక్షల మందితో జరిగే యోగా కార్యక్రమంలో ప్రధానమంత్రి, ముఖ్య మంత్రి పాల్గొంటున్నారని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మంది యోగా ప్రయోజనాలు పొందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బీవై రామయ్య, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ఆరోగ్యం సాధ్యమ వుతుందని, ఒత్తిడి తగ్గి ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, నగర మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డీఆర్వో వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, డీఎంహెచ్వో శాంతి కళ, ఆయుష్ శాఖ డా.ప్రసాద్, యోగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అవినాష్, యోగా శిక్షకులు మునిస్వామి, విజయ్ కుమార్, డా.ముంతాజ్ బేగం, గౌరీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం

విశాలాంధ్ర - మంత్రాలయం: వడ్డె బాలరాజు కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి, మండల కేంద్రంలోని రామచంద్ర నగర్‌లో నివాసముంటున్న వడ్డే బాలరాజు మంగళవారం రాత్రి మృతి చెందిన విషయం అందరికీ తెలిసిందే. బుధవారం విషయం తెలుసుకున్న పెద్దాయన టీటీడీ మాజీ పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి, వడ్డే బాలరాజు భౌతిక కాయంకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వీరితో పాటు వైసీపీ మండల అధ్యక్షులు గుర్రెడ్డి భీమారెడ్డి, వైసీపీ మండల ఇన్ చార్జ్ సి.వి.విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వడ్డే నారాయణ, జనార్ధన్ రెడ్డి గంగపుత్ర సంఘం అధ్యక్షులు శాంతయ్య తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం : మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన హరిజన హనుమంతప్ప మంగళవారం సాయంత్రం గుండె పోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు మాజీ వైస్ఎంపీపీ వెంకోబా, స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు హనుమంతప్ప మృత దేహంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.10 వేల నగదును తక్షణ సాయం కింద అందజేశారు.

అట్టహాసంగా వంద పడకల ఆసుపత్రి ప్రారంభం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు వంద పడకల ఆసుపత్రిని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పెద్ద సంకల్పంతో మాచాని సోమప్ప స్థలాలు ఇస్తే ఎమ్మెల్యేగా, మంత్రిగా బీవీ మోహన్ రెడ్డి అభివృద్ధిని చేశారని గుర్తు చేశారు. ఆయన చేసిన అభివృద్ధి నేటికీ కంటికి కనబడుతూనే ఉందన్నారు. నాడు 30 పడకల ఆస్పత్రికి ప్రారంభమై నేడు వంద పడకల ఆసుపత్రిగా తన చేతుల ద్వారా ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు. గుండె వైద్య నిపుణులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మిగనూరు ఆసుపత్రి డెలివరీస్‌లో రాష్ట్రంలో మొదటి స్థానం రావడం పట్ల వైద్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, ఆసుపత్రి సూపరిండెంట్ సుధా, వైద్యులు మల్లికార్జున, బాలాజీ, చిరంజీవి, భార్గవ్, సమీరా, హెచ్‌డీసీ సభ్యులు వాల్మీక రామకృష్ణ నాయుడు, సురేష్ చౌదరి, అంబేద్కర్, కమిషనర్ గంగిరెడ్డి, వైద్య సిబ్బంది విష్ణు, దొరబాబు, పార్టీ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మినీ మహానాడు వేడుకలు

విశాలాంధ్ర - వెల్దుర్తి: మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయ ప్రాంగణంలో మినీ మహానాడు వేడుకలను నిర్వహించారు. ముందుగా సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహంతో పాటు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల పాకిస్థాన్ సైనికుల కాల్పుల్లో అమరుడడైన మురళి నాయక్, నియోజకవర్గంలో చనిపోయిన టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు నాయకులతో కలిసి రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ముఖ్య అతిథులుగా పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు, మాజీ మంత్రి ప్రభాకర్, టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో సచివాలయాలు నిర్మించారు, కానీ ఎందుకు పనికి రాకుండా పోయాయి. వెల్దుర్తి, కృష్ణగిరి, మండలాలకు పరిశ్రమలను తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం మహానాడు సన్నాహక సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎల్ఈ జ్ఞానేశ్వర్ గౌడ్, సీనియర్ టీడీపీ నాయకులు బొమ్మిరెడ్డి పల్లె సుబ్బరాయుడు, మండల అధ్యక్షుడు బలరాం గౌడ్, రమాకాంత్ రెడ్డి, తుగ్గలి నాగేంద్ర, బోయినపల్లి కాంతారెడ్డి, సూదేపల్లె జయ రాముడు, ఆనంద్, పుల్లగుమ్మి, వెంకటేశ్వర్ రెడ్డి, నియోజకవర్గ మండల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

విశాలాంధ్ర - పెద్ద కడబూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని 5వ వార్డులో ఉన్న బోరు చెడి పోయింది. దీంతో కాలనీ వాసులకు నీటి కొరత ఏర్పడింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ రామాంజనేయులు బుధవారం మెకానిక్ ద్వారా బోరుకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామంలోని అన్ని కాలనీలకు మంచినీటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా తీవ్రవాద వ్యతిరేక దినోత్సవం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో యాంటీ టెర్రరిజం డే ను పురస్క రించుకొని బుధవారం నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో తీవ్రవాదం నిర్మూలించడంలో మన వంతు పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆల్ ఇండియా నేషనల్ జనరల్ సెక్రెటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జ్ఞాపకార్థం ఈ నెల 21న ఆంటీ టెర్రరిజం డేగా జరుపుకుంటామని, దేశంలో తీవ్రవాదానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి నిర్దేశించ బడిందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్ సభ్యులు, లక్ష్మీ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు లయన్ రాయపాటి నాగ లక్ష్మి, యువతీ యువకులు పాల్గొన్నారు. తీవ్రవాదానికి వ్యతిరేకంగా శాంతి కోసం కృషి చేయాలని యువతీ, యువకులచే ప్రతిజ్ఞ చేయించారు.

వాలీబాల్ విజేతలకు బహుమతులు అందజేత

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలోని వాలీబాల్ శిక్షకుడు రవితేజ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తెలుగు రాష్ట్రాల అండర్ -14 బాలుర, బాలికల వాలీబాల్ పోటీలకు 19 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు బహుమతులు అందజేసిన ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనంలో నుండి క్రీడల పట్ల దృష్టి సారించాలని తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయంకాలం 2 గంటలసేపు వ్యాయామం చేయడం వల్ల ఎలాంటి రోగాలు రావని ఆయన తెలిపారు. విజేతలు మునుముందు విజయాలు సాధించి, జీవితంలో ఉన్నతమైన స్థానంలో ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రమ్య, అనూష, దత్తు ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షులు కొండేపోగు చిన్న సుంకన్న, బి.క్యాంప్ వాలీబాల్ స్నేహితులు అందరూ కలిసి ఈ టోర్నమెంట్ కు సహాయపడ్డారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, విశ్వం, స్వాములు, రమేష్, అఫ్జల్, అఖిల్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: పట్టణంలో ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలలో ఫీజులు దోపిడీ అరికట్టి, జీవో నెంబర్:01 అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు విష్ణు తెలిపారు. అనంతరం సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డొనేషన్ల, ఫీజుల పేరుతో వేలాది రూపాయలు బలవంతంగా వసూలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను భయపెట్టి ప్రైవేట్ పాఠశాల యజమానులు వసూలు చేస్తున్నారని, ఈ దోపిడి అరికట్టాల్సిన విద్యాశాఖ అధికారులు మామూల మత్తులో మునిగి తేలుతున్నారని వారు తెలిపారు. ఇప్పటికైనా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు జీవో నెం.1 అమలు చేసి అక్రమ ఫీజులను అరికట్టాలని, లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీను, రవి, పరమేష్, రాజు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వినికిడి లోపాన్ని గుర్తించే పరీక్ష గది ప్రారంభం

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఈఎన్‌టీ ఓపీ విభాగంలో వినికిడి లోపాన్ని గుర్తించే పరికరాలను గదిని బుధవారం ఉదయం హాస్పిటల్ పర్యవేక్షకులు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభోత్సవం చేశారు. బేరా పరీక్ష ద్వారా పేషెంట్లకు వినికిడి లోపాన్ని గుర్తించి, సమస్య తీవ్రత ఆధారంగా సర్జరీలు నిర్వహిస్తారని అన్నారు. సదరం సర్టిఫికేట్లు వంటి వైకల్య ధృవపత్రాల ఖచ్చితత్వం, సమగ్రతను నిర్ధారించడంలో బెరా ఒక విలువైన పరీక్షా అని అన్నారు. ఈ కార్యక్రమానికి సీఎస్ఆర్ఎంఓ డా.వెంకటేశ్వరరావు, ఈఎన్టీ హెచ్ఓడీ డా.వీర కుమార్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా.శివ బాల నగాంజన్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు పోటెత్తిన వరద

విశాలాంధ్ర- గూడూరు: సుంకేసుల జలాశయానికి వరద ప్రవాహం పోటెత్తింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఎగువ ప్రాంతం నుండి 17 వేల క్యూసెక్కులు నీరు బుధవారం సుంకేసుల జలశయానికి వచ్చి చేరుతుంది. దీంతో నాలుగేట్లు ఎత్తి 17 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. జలాశయ సామర్థ్యం సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా, తాగునీటి కోసం కేసీ కెనాల్ 150 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలే..

విశాలాంధ్ర - తుగ్గలి: జిల్లాలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం మండలంలోని జొన్నగిరి, తుగ్గలి పోలీస్ స్టేషన్లను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలో ఉన్న పరిస్థితులపై పోలీసులును అడిగి తెలుసుకున్నారు. అనంతరం శాంతిభద్రతల పరిరక్షణకు, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు, ప్రభుత్వ చట్ట వ్యతిరేక కార్యక్రమాల నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను పోలీసులకు సూచించారు. తుగ్గలి పోలీస్ స్టేషన్లో శిథిలావస్థకు చేరిన పోలీస్ క్వార్టర్లను, పాత పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. పోలీసులకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీసుల సమస్యల పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని తెలిపారు. డీఎస్పీ వెంకటరామయ్య, రూరల్ సీఐ పులి శేఖర్, ఎస్ఐ లు కృష్ణమూర్తి, మల్లికార్జున, పోలీసులు పాల్గొన్నారు.

రైతులు మెచ్చిన అధికారికి బదిలీవేటు తప్పదా..?

విశాలాంధ్ర - ఆదోని రూరల్: వ్యవసాయ రంగాన్ని ప్రేమిస్తూ అవసరాల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన రైతులను ఆప్యాయంగా పలకరిస్తూ, గౌరవిస్తూ రైతులు మెచ్చిన అధికారిగా పేరుపొందిన వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల ప్రధాన అధికారికి బదిలీ తప్పదా అన్న సందిగ్ధత రైతుల్లో నెలకొంది. రైతుల వద్ద నయా పైసా ఆశించని అధికారి, ఫర్టిలైజర్ దుకాణాల్లో అవినీతికి పాల్పడుతున్న వ్యాపారస్తులకు ఉక్కు పాదం మోపుతూ విధులు నిర్వహిస్తున్న అధికారి నీతి నిజాయితీకి మారుపేరుగా, ఆదోని మండలంలోని రైతుల చేత ఆ అధికారి మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారు. పట్టణ కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాన్ని నిర్వహిస్తున్న వ్యాపారి తన సామాజిక వర్గానికి చెందిన కూటమి ప్రధాన ప్రజాప్రతినిధితో బదిలీ చేయించాలన్న సంకల్పము పెట్టుకున్నట్లు సమాచారం. ప్రస్తుత వ్యవసాయ శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారి వ్యవసాయ రంగంలో మంచి పట్టు ఉంటూ, రైతులకు ఎల్లవేళల అందు బాటులో ఉంటూ వ్యవ సాయ రంగా బలోపేతానికి తనవంతుగా పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫర్టిలైజర్ దుకాణం యజమాని తన సామాజిక వర్గానికి చెందిన వ్యవసాయ అధికారిని వేయించుకోవాలని కూటమి ప్రధాన ప్రజా ప్రతినిధితో ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదేమైనప్పటికీ ఇటువంటి వ్యవసాయ అధికారి ఆదోని ప్రాంతానికి చెందిన రైతులకు ఎంతగానో అవసరమని పలువు రైతులు కోరుతున్నారు.

విశాలాంధ్ర - కర్నూలు : నగరంలోని బంగారు పేటలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిలోని అక్రమాలు తొలగింపు సమయంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ పార్థసారథి రెడ్డి దాడి చేసి, గాయపరిచిన ఘటనలో ఏడుగురు నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ కర్నూలు అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దివాకర్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2021 నవంబర్ 30న కర్నూలు టూ టౌన్ పరిధిలోని బంగారు

సీఐపై దాడి కేసులో ఏడుగురికి జైలు

పేటలో కేసీ కెనాల్ కట్టకు పక్కన ప్రభుత్వ స్థలమును ఆక్రమించుకొని నిర్మించుకున్న అక్రమ కట్టడాలను తొలగించుటకు బందోబస్తుగా అప్పటి టూటౌన్ సీఐ పార్థసారథి రెడ్డి, కోడుమూరు సీఐ శ్రీధర్ వారి సిబ్బందితో వెళ్లారు. జేసీబీతో ఆక్రమానాలు తొలగిస్తుండగా కొంతమంది రాళ్లతో పోలీసులపై దాడి చేయగా అందులో సీఐ పార్థసారథి రెడ్డికి గాయాలు అయ్యాయి. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అనంతరం దాడి చేసిన వ్యక్తులపై టూ టౌన్‌లో ఫిర్యాదు చేశారు. బంగారు పేటకు చెందిన లక్ష్మి, నీలి శికారి బెల్కి, ఎం.నర్సింలు, నీలీ షికారి సుగుణ, ప్రసాద్ నీలిశిఖరి, నాగమణి, నీలసికారి బెంగినీలపై అభియోగ పత్రాలు దాఖలు చేశారు. కేసు విచారణలో వారిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధించారు.

మహానాడు కమిటీ ఎంపికపై హర్షం

విశాలాంధ్ర- చిప్పగిరి: కడప జిల్లాలోఎంతో ప్రతిష్టాత్మకంగా టీడీపీ నిర్వహించే మహానాడు కమిటీకి జిల్లా ఆలూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు రవి కుమార్ యాదవ్‌ను ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. టీడీపీ వ్యవస్థాపకులు కీర్తిశేషులు ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకొని రాష్ట్రంలోని కడప జిల్లాలో ఈ నెల 27, 28, 29 నిర్వహించే మహానాడు కార్యక్రమానికి రవాణా కమిటీలో ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి మండలం నేమకల్లు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు రవి కుమార్ యాదవ్ ఎంపిక పట్ల తాలూకా నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

18 ఏళ్లు నిండిన యువత ఓటు నమోదు చేసుకోవాలి : జేసీ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: 18 ఏళ్లు నిండిన యువత ఓటు నమోదు చేసుకునేలా చూడాలని పాణ్యం పొలిటికల్ పార్టీ ప్రతినిధులకు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పాణ్యం నియోజకవర్గ పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతను, ట్రాన్స్‌జెండర్స్‌ను గుర్తించి ఫామ్ 6 ద్వారా ఓటు నమోదు చేసుకునేలా చూడాలని పాణ్యం నియోజకవర్గ పొలిటికల్ పార్టీ ప్రతినిధులకు జాయింట్ కలెక్టర్ సూచించారు. ఇప్పటివరకు పాణ్యం నియోజకవర్గంలో 1177 డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించడం జరిగిందన్నారు. దాదాపు 500 నూతన ఓటర్లను నమోదు చేయడం జరిగిందని అన్నారు. నియోజకవర్గంలో 1200 ఓట్లు దాటి ఉన్నటువంటి పోలింగ్ స్టేషన్లను గుర్తించి, అదనముగా ఉన్న ఓటర్లను ఫార్మ్ 8 ద్వారా ఇతర పోలింగ్ స్టేషనులకు బదిలీ చేయడం జరుగుతుందన్నారు. ఓటరు నమోదు కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని తెలియజేశారు. ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్, జనవరి, మాసాలలో ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. వివాహం చేసుకొని వెళ్లిన మహిళలు, ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, వలసలు వెళ్లినవారు తమ ఓటును బదిలీ చేసుకోవచ్చు అని జాయింట్ కలెక్టర్ తెలిపారు. పొలిటికల్ పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బీఎల్వోలు సక్రమంగా విధులు నిర్వహించేలా చూడాలని, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లు వెరిఫికేషన్ జరిపి డూప్లికేట్ ఓట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని, నియోజకవర్గంలోని ట్రాన్స్ జెండర్స్ గుర్తించి వారికి ఓటు హక్కు కల్పించాలని, జాయింట్ కలెక్టర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రతినిధి మంజునాథ్, బీఎస్పీ పార్టీ ప్రతినిధి రామశేషయ్య, బిజెపి పార్టీ ప్రతినిధి నాగరాజు, సీపీఎం(ఎం) ప్రతినిధి రామకృష్ణ, ఐఎన్‌సీ పార్టీ ప్రతినిధి ఎస్ రజాక్ వల్లి, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, పాణ్యం తహశీల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి, గడివేముల తహశీల్దార్ వెంకటరమణ, ఓర్వకల్లు డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ జి అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో పేదల కడుపులు కాల్చడమా

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల పట్టణంలో పలు వార్డులలో రేషన్ కార్డుల దారులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయకుండా కడుపులు కార్చడం దుర్మార్గమని సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న అన్నారు. బుధవారం సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో డిప్యూటీ తాహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి జి.రంగన్న, సీపీఐ మంత్రాలయం నాయకులు భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల పట్టణంలోని పలు వార్డులలోని కార్డు దారులకు మే నెలకు సంబంధించిన రేషన్ అందకా నానా ఇబ్బందులకు గురయ్యారన్నారు. రేషన్ దుకాణాల్లో అవకతవకలు జరగడంతో ఆ షాపులను విజిలెన్స్ అధికారులు సీజ్ చేయడం జరిగిందని, దీంతో రెవెన్యూ అధికారులు మే నెలకు సంబంధించి ఆ దుకాణాలకు రేషన్ సరుకులు పంపిణీకి అనుమతిని రద్దు చేశారాని, రద్దు చేసిన దుకాణాలకు సంబంధించిన ఆ వార్డు కార్డుదారులకు ఇన్చార్జిల ద్వారా, ఇతరుల ద్వారా వెంటనే రేషన్ పంపిణీ చేయాల్సిన బాధ్యత రెవిన్యూ అధికారులపై ఉందన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ తో మాట్లాడి ప్రత్యేక అనుమతి తీసుకుని నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు దాదావలి, ఏసీ జబ్బర్, మల్లికార్జున గౌడ్, ఇస్మాయిల్, నరసింహులు, సుంకన్న, నాగరాజు పాల్గొన్నారు.

లాస్య రెడ్డికి ఘన సన్మానం

విశాలాంధ్ర-పత్తికొండ: సీబీ ఎస్సీ ఈ పదవ తరగతి పరీక్ష ఫలితాలలో పత్తికొండకు చెందిన లాస్య రెడ్డి 500 మార్కులకు గాను 496 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు, ఆల్ ఇండియా మూడో ర్యాంకు సాధించింది. బుధవారం ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థి లాస్య రెడ్డిని దుశ్శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్స్ కొత్తపల్లి సత్యనారాయణ, కుంపటి నారాయణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు బలరాం, చంద్రశేఖర్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి మారుతి పాల్గొన్నారు.

చోరి కేసులో నిందితులు అరెస్టు

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల పరిధిలోని ముచ్చిగిరి గ్రామంలో గత వారంలో జరిగిన దొంగతనం కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముద్దాయిలు బోయ ఉరుకుందు, సూగూరు హరికృష్ణ, బోయ నర్సింహులును ఊరి బయట అరెస్టు చేసి, వారి వద్దనుండి 24 గ్రాముల బంగారు ఆభరణాలు, 24 తులాల వెండి ఆభరణాలు, 15వేల నగదును రికవరీ చేసినట్లు తెలిపారు. ప్రజలు వలసలకు వెళ్లినప్పుడు ఇంటిలో విలువైన నగలు, డబ్బులను పెట్టి వెళ్లరాదని తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, గురువారం 22, మే 2025

వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు ప్రారంభం

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో 40వ జాతీయ రహదారి ప్రక్కనగల నెట్టికంటి అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం ఉదయం హనుమాన్ జయంతి వేడుకలు ఆధ్యాత్మిక వైభవంగా ప్రారంభం అయ్యాయి. సీతారామ లక్ష్మణ స్వాములవారికి ఆంజనేయ స్వామికి విశేష పూజలు కొనసాగాయి. అశేష భక్త జన సందోహం మధ్య ఆంజనేయ స్వాముల వారికి గణపతి పూజ, కుంకుమ పూజ, కలశపూజ, పంచగవ్యప్రాసన, వృథ్విఘరణము, పుణ్యా హవానము నిర్వహించారు. భక్తుల కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చుతూ నిత్యం ధూప దీప నైవేద్యాలతో ఆధ్యాత్మిక వైభవంగా విరాజిల్లు తున్న శ్రీ నెట్టికంటి అభయ ఆంజనేయ స్వామి దేవాలయ ము నందు శ్రీ సీతారామ చంద్రమూర్తికి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చక స్వాములు నిర్వాహకులు ప్రముఖులు గ్రామ పెద్దలు తీర్థప్రసాదములతో పాటు హాజరైన భక్త జన సందోహానికి అంతటికి ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 22 గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా కళాకారుల ఆధ్యాత్మిక చక్కభజన కార్యక్రమం, అన్నదాన కార్యక్రమం, గ్రామోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

యోగాంధ్రలో ప్రజలందరిని భాగస్వామ్యం చేయండి

- జూన్ 21వ వరకు ప్రచార కార్యక్రమాలు
- ఆస్తి పన్ను మదింపు పక్కాగా చేపట్టండి
- కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన మోగాంధ్ర కార్యక్రమంపై ప్రజల్లో చైతన్యం కలిగించి మాసోత్సవ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయ్యేలా చూడాలని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ మందిరంలో అడ్మిన్, అమినిటీస్, ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మే 21 నుండి జూన్ 21వ తేదీ వరకు యోగా ప్రాముఖ్యతను విస్తృత ప్రచారం ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించాలని, 40శాతం మంది ప్రజలు యోగా ంధ్రలో భాగస్వామ్యం అయ్యేలా చూడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యోగాంధ్ర యాప్‌లో సుముఖంగా ఉన్న వారి వివరాలను నమోదు చేయాలని, వచ్చే నెల 21న కర్నూలులో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి పెద్దసంఖ్యలో ప్రజలు తరలి వచ్చేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం మాసోత్సవ కార్యాచరణను వివరించారు.

ఆస్తి పన్ను మదింపు పక్కాగా చేపట్టండి: రాష్ట్ర వ్యాప్తంగా నగర, పట్టణాల్లో కొంతమంది యజమానులు అధునాతన భవనాలు కట్టినా పాత ఇంటి బిల్లులు ఇంకా జనరేట్ అవుతునందున, వాటిని పునఃపరిశీలన ద్వారా సరి చేయాలని కమిషనర్ సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టి, కొలతలకు విరుద్ధంగా పన్ను ఉండటం, కొత్తగా భవనాలు నిర్మించినా, మొదటి అంతస్తు వరకు పన్ను వేసి రెండు, మూడు అంతస్తులకు పన్నులు లేకపోవడం, కాలనీలకు పన్నులు వేయకపోవడం, డాక్యుమెంట్లు సరిగ్గా లేవని పన్నులు వేయకపోవడం వంటి అంశాలను పరిగ ణనలోకి తీసుకుని క్షుణ్ణంగా పునః పరిశీలించాలని సూచిం చారు. ఏమాత్రం తగ్గినట్లు అనుమానం ఉన్నా తక్షణమే వాటికి పన్నులు విధించాలని ఆదేశించారు. నగరంలో పునః పరిశీలన ద్వారా రూ.15.54 కోట్ల అదనపు పన్ను ఆదాయం రావాల్సి ఉందన్నారు. ట్యాబ్ కనెక్షన్‌లను సైతం పరిశీలిం చాలని, ఏవైనా కారణాలతో కొళాయి చార్జీలు విధించకపోయి ఉంటే తక్షణమే చార్జీలు వేయాలని పేర్కొన్నారు. వచ్చే నెల 15 వరకు ఈ సర్వే పూర్తి చేయాలని, ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిన కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, ఆర్‌ఓ జునైద్, సూపరింటెండెంట్ వాజిద్, ఆర్ఐలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్షా సమావేశం

విశాలాంధ్ర - తుగ్గలి: ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన పక్కా గృహాలను వేగవంతంగా నిర్మించేందుకు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.చిరంజీవి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.చిరంజీవి మాట్లాడుతూ లబ్ధిదారులు సకాలంలో ఇంటి నిర్మాణాలు చేపడితే బిల్లులు సకాలంలో మంజూరు అవుతాయని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయకుమార్, ఎంపీడీవో విశ్వమోహన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు 443 గైర్హాజరయ్యారు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లాలో పదో తరగతి, ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఆంధ్రప్రదేశ్ ఓపెన్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. పదో తరగతి పరీక్ష మొత్తం 5098 మంది విద్యార్థిని విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3953 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 1145 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ 10వ తరగతి పరీక్షకు మొత్తం 192మంది విద్యార్థిని విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 172 మంది విద్యార్థులు విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 20 మంది గైర్హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షకు మొత్తం 512 మంది విద్యార్థులు విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 460 మంది విద్యార్థి విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 52 మంది గైర్హాజరయ్యారు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సామేల్ పాల్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలకు సంబంధించి మొత్తం 80 పరీక్ష కేంద్రాలకు జిల్లా విద్యాశాఖ అధికారి 5 పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. సహాయ కమిషనర్ 5 పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. ఫ్లేయింగ్ స్క్వాడ్లు 20 పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారని ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని వారు తెలిపారు.

చౌక్ మస్జీద్, లతీఫియా మస్జీద్‌లకు నూతన కమిటీల ఎంపిక

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణం లోని చౌక్ మస్జిద్ అధ్యక్షులుగా మనియార్ అర్షద్ అహ్మద్, కార్యదర్శిగా డిఎస్ జాఫర్, అలాగే లతీఫియా మస్జిద్ అధ్యక్షులుగా డిఎస్ జాహిద్ హుస్సేన్, కార్యదర్శిగా అడ్వకేట్ ఖలీల్‌లను ఎన్నుకు న్నారు. నూతన కమిటి సభ్యులకు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ నియామక పత్రాలను అందజేసారు. నూతనంగా ఏర్పడ్డ కమిటీ ద్వారా చౌక్ మస్జిద్, లతీఫియా మసీదులందు ప్రజల కొరకు మౌలిక వసతులు కల్పించి స్ఫూర్తిదా యకమైన మార్గదర్శక కేంద్రాలుగా ఎదగాలన్నారు. ప్రభుత్వం తరఫున ముస్లిం మైనారిటీల అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తామన్నారు.

ఎమ్మెల్యే బాల నాగిరెడ్డిని ఓడించడం ఎవరితరం కాదు

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని 2029లో కాదు కదా, 2039లోను ఎమ్మెల్యేగా ఓడించడం ఎవరి తరం కాదని వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి ఈరన్న టీడీపీ యువనేత మాధవరం రామకృష్ణారెడ్డికి ఘాటుగా జవాబిచ్చారు. బుధవారం ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి స్వగృహం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి ఈరన్న, వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు, పెద్దకడబూరు గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, మాజీ ఎంపీపీ రఘురామ్ మాట్లాడుతూ వైసీపీ, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిపై బురద చల్లడం టీడీపీ నేతలు మానుకోవాలని హితవు పలికారు. మంత్రాలయంలో జరిగిన మినీ మహానాడులో టీడీపీ నేతలు వైసీపీపైన, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిపైన అసత్య ఆరోపణలు చేయడం తప్పా మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడక పోవడం బాధాకరమన్నారు. 2029లో ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డిని ఓడిస్తామని టీడీపీ యువనేత రామకృష్ణారెడ్డి మాట్లాడడం హాస్యాస్ప దంగా ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల అండ దండలు ఉన్నంత వరకు బాలనాగిరెడ్డిని ఓడించడం ఎవరి తరం కాదని హెచ్చరించారు. టీడీపీ నేతలు ముందుగా ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అందించడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. మంత్రాలయం నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదని టీడీపీ నేతలు మాట్లాడడం చూస్తే విద్యా వ్యవస్థపై వారికి ఉండే చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుందని తెలిపారు. హను మాపురం గ్రామ శివారుల్లోని శ్రీ మహాయోగి లక్ష్మమ్మ అవ్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంత్రాలయం నియో జకవర్గంలోని కాదా అని టీడీపీ నేతలను ప్రశ్నిం చారు. బాలనాగిరెడ్డికి పేదల విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ ఉండబట్టే హెచ్ మురవణి, గవిగట్టు గ్రామాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు భవన నిర్మాణం కోసం ప్రత్యేక చొరవతో స్థల సమస్యను పరిష్క రించారని గుర్తు చేశారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి హయాంలోనే బీసీలకు పెద్దపీట వేశారని పేర్కొన్నారు. మంత్రాలయం నియోజక వర్గంలో ఇన్ చార్జ్ ముసుగులో టీడీపీ నేతలు దోచేస్తున్నారని ఆరోపిం చారు. పెద్దకడబూరు మండలంలోని వివిధ గ్రామాలలో గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను సైతం సక్రమంగా వినియో గించుకోకుండా టీడీపీ నేతలు అడ్డు పడుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఏడాది కావస్తున్నా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా వైసీపీపై బురద చల్లడానికే పరిమిత మయ్యారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ పని తీరు, టీడీపీ నేతల ఆగడాలను ప్రజలు గమనిస్తు న్నారని, బుద్ధి చెప్పేందుకు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు, బురద చల్లడాలు మానుకొని పేదలకు సూపర్ సిక్స్ పథకాలను అందించడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జాలవాడి ఎంపీటీసీ కురువ వెంకటేష్, వైసీపీ నాయ కులు జాలవాడి బసన్న, చిన్నకడబూరు లక్ష్మన్న, కంబళదిన్నె నరసప్ప, అళ్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ డెస్క్ పోర్టల్ దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : సూక్ష్మ పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిం చాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రమోషన్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ నిర్వహించారు. సమావేశంలో పరిశ్ర మల శాఖ జీఎం జవహర్ బాబు, ఎల్డిఎం రవీందర్ కుమార్, నంది మిల్క్ మేనేజింగ్ డైరెక్టర్ రామలింగారెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రాజమహేంద్రనాథ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ సూక్ష్మ పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు సింగిల్ డెస్క్ పోర్టల్ లో వచ్చే దరఖాస్తులను నిర్ణీత కాల వ్యవధిలోగా అనుమతులు మంజూరు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా ఇప్పటి వరకు 124 దరఖాస్తులు రాగా అందులో 103 దరఖాస్తులకు అప్రూవ్ చేయడం జరిగిందని, ఇంకా పెండింగులో ఉన్న 21 దరఖాస్తులను కూడా ఆమోదం తెలిపేందుకు అవసరమైన పత్రాలను పొంది అనుమతులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ను కలెక్టర్ ఆదేశించారు.

డాక్టర్ టి.రాజు కుమార్ అకాల మృతి వర్సిటీకి తీరని లోటు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాయలసీమ యూనివర్సిటీ జువాలజీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ టి.రాజు కుమార్ అకాల మరణం వర్సిటీకి తీరని లోటని వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి.వెంకట బసవరావు నివాళులర్పించారు. అనా రోగ్యం కారణంగా జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ (సి) డాక్టర్ టి.రాజుకుమార్ బుధవారం ఉదయం మృతి చెందడం బాధాకరమన్నారు. వర్సిటీ వీసీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన రాజ్ కుమార్ సంస్మరణ కార్యక్రమంలో ఆచార్య బసవరావు మాట్లాడుతూ ఈ కష్టసమయంలో ఆ కుటుంబానికి వర్సిటీ బాసటగా నిలుస్తుందన్నారు. ఆయన అంత్యక్రియల నిమిత్తం 25వేల రూపాయలను తక్షణమే మంజూరుచేస్తున్నట్లు వీసీ తెలిపారు. తనకు అప్పగించిన ఏ పనినైనా శ్రద్ధగా నిర్వర్తించే వ్యక్తిత్వం డాక్టర్ రాజ్ కుమార్ సొంతమని వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్కుమార్ నాయుడు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య పీవీ సుందరానంద్, రీసర్చ్ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య సి.విశ్వనాథరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య ఆర్, భరత్ కుమార్, వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లుతోపాటు వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు డాక్టర్ రాజ్ కుమార్‌కు నివాళు లర్పించారు. ఆయన ఆత్మకు శాంతికలగాలని మౌనం పాటించారు. అనంతరం స్థానిక బి.తాండ్రపాడులో ఆయన నివాసం వద్దకు వెళ్లి డాక్టర్ రాజ్ కుమార్ భౌతిక దేహానికి వర్సిటీ రెక్టార్, రిజిస్ట్రార్తోపాటు ఇతర అధికారులు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వర్సిటీ తరపున రూ.25 వేల చెక్కును అందజేశారు.

మండల, పట్టణ అధ్యక్షులకు సన్మానం

విశాలాంధ్ర - వెలుగోడు : శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆశీస్సులతో వెలుగోడు టీడీపీ మండల అధ్యక్షులుగా ఎన్నికైన మొల్లా అబ్దుల్ కలాం, టీడీపీ పట్టణ అధ్యక్షులుగా ఎన్నికైన మోమిన్ రసూల్‌ను వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారము ఘనంగా సన్మా నించారు. వీరు ప్రజలకు సేవ చేసి మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చు కోవాలని, మరెన్నో ఉన్నత పదవులు అధిరోహిం చాలని నాయకులు కోరారు. సంఘము నాయకులు అబ్దుల్ రవూఫ్, ఇంతియాజ్ దివ్యాలాంగులు కలిసి సన్మానం చేయడం జరిగింది.

పోలీస్ స్టేషన్‌కు వాటర్ కూలర్ వితరణ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరఫున వాటర్ కూలర్‌ను వితరణగా బుధవారం అందించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ రెంటాల మారుతి కుమార్ టూ టౌన్ సీఐ ఇస్మాయిల్‌కు వాటర్ కూలర్‌ను అందజేశారు. సీఐ ఇస్మాయిల్ మాట్లాడుతూ వాటర్ కూలర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించే సిబ్బందితో పాటు పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సెవెన్ హిల్స్ హాస్పిటల్స్ అధినేత రెంటాల మారుతి కుమార్ మాట్లాడుతూ నంద్యాల ప్రజలకు రక్షణ కల్పిస్తున్న పోలీసులకు ఉపయోగపడుతుదని వాటర్ కూలర్ ను అందించామన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు కూడా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన విజన్ ప్లాన్ టీం సభ్యులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే స్వగృహంలో కలిశారు. డీఆర్డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఎంపీడీవో మహబూబ్ ఖాన్ ఆధ్వర్యంలో టీం సభ్యులు కలిసి నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌ను ఎమ్మెల్యేకు అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ విజన్ ప్లాన్‌పై ఎమ్మెల్యేతో చర్చించారు.

ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా వారికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి మస్తాన్ ఖాన్ మాట్లాడుతూ కంప్యూటర్ రంగాన్ని భారతదేశానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి రాజీవ్ గాంధీ అని, సాంకేతిక రంగానికి మారుపేరు రాజీవ్ గాంధీ అని ఆయన సేవలను కొనియాడారు. ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

పలుకుర్‌లోని వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర - బనగానపల్లె: మండల పరిధిలోని పలుకూరు వడ్డెపేట కాలనీలో నిర్మిస్తున్న శ్రీవెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణం కొరకు మిడుతూరు మండలం దేవనూరు గ్రామ వాస్తవులు వడ్డే పెద్ద ఎల్లయ్య కుమారుడు మార్ల రాజు 5000 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతను గుడి నిర్వాహకులు అభినందించారు.

బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: మండల స్పెషల్ అధికారులు వారి బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని, ప్రతి వారం మండలాలకు వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మండల స్పెషల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు నెలల్లో ఎన్ని రోజులు మండలాలకు వెళ్లారు. త్రాగునీరు సమస్య ఉందా, పారిశుద్ధ్యం ఎలా ఉంది, పాజిటివ్ పర్సెప్షన్ ఎలా ఉంది, హౌసింగ్ పరిస్థితి ఏంటి, ఉపాధిహామీ పనులు ఎలా జరుగుతున్నాయి, ఎక్కడైనా సమస్యలు గుర్తించారా అని మండల స్పెషల్ అధికారులను ప్రశ్నించారు. మండల స్పెషల్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి వారం మండలాలకు వెళ్లి అన్ని ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్ష చేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, హౌసింగ్, పాజిటివ్ పర్సెప్షన్, జీఎస్డబ్ల్యూఎస్ సర్వీసులు, తదితర అంశాలపై తప్పనిసరిగా సమీక్ష చేయాలన్నారు. ఎక్కడైనా నిర్దిష్ట సమస్య ఏమైనా ఉంటే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మండల స్పెషల్ అధికారులను ఆదేశించారు.. ఏమైనా ఇంకా పెద్ద సమస్యలు ఉంటే తన దృష్టికి కూడా తీసుకొని రావాలన్నారు.ప్రతి నెలా 16 ప్రభుత్వ అంశాల అమలు మీద ఐవిఆర్ ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించడం జరుగుతోందని, ప్రజాభిప్రాయం వ్యతిరేకత వ్యక్తమైతే వాటిని సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మండల స్పెషల్ అధికారులను ఆదేశించారు.ఈ అంశంపై సమీక్షలు నిర్వహించి, నివేదికలు పంపించాలని కలెక్టర్ మండల స్పెషల్ అధికారులను ఆదేశించారు. మండల స్పెషల్ అధికారిగా ఉన్నప్పటికీ గత రెండు నెలల నుండి తనకు కేటాయించిన నందవరం మండలానికి వెళ్లి మండల పురోగతి పై సమీక్ష నిర్వహించలేదని నందవరం మండల స్పెషల్ అధికారి, పరిశ్రమల శాఖ ఇంచార్జి జీఎంను సంజాయిషీ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. వేదవతి నదికి వరద వచ్చిన పరిస్థితుల్లో సంబంధిత మండలాల స్పెషల్ అధికారులు విజిట్ చేసి రెవెన్యూ అధికారులతో కలిసి పరిస్థితిని సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, మండల స్పెషల్ అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ ఆర్డీఓ భరత్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడిందొక్కటి.. వైరలయ్యిందొక్కటి..

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : జిల్లా ఆళ్ళగడ్డలోని శ్రీరామ కళ్యాణ మండ పంలో గత రెండు రోజుల క్రితం నిర్వ హించిన మినీ మహా నాడు కార్యక్రమంలో తాము మాట్లాడింది ఒకటి అయితే.. మీడియా అత్యుత్సా హంతో మరో కథనం వైరల్ చేయడం జరిగిందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను పార్టీ అధిష్టానాన్ని చంద్రబాబును, లోకేష్‌ను ఉద్దేశించి విమర్శలు చేసినట్లు సోషల్ మీడియా.. తదితర మీడియాలో వక్రీకరించి రాయడం జరిగిందన్నారు. దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి పదవులు ఇవ్వండి అని కోరడం జరిగింది తప్ప.. వెనక దారి నుంచి వచ్చిన వారికి పదవులు ఇవ్వద్దు అని మినీ మహానాడులో చెప్పడం మాత్రమే జరిగిందన్నారు. బ్యాక్ డోర్ నుంచి వచ్చిన వారికి పదవులు ఇస్తే వారిని పార్టీ క్యాడర్ ఊర్లోకి కూడా రానివ్వరు అని చెప్పడం జరిగిందన్నారు. ఎప్పటి నుండో పార్టీ కోసం పని చేసిన శిరివేళ్ళ మండల కన్వీనర్ గా ఉన్న శ్రీకాంత్ రెడ్డి కి పదవి ఇవ్వాలని చెప్పడం జరిగిందన్నారు. సాక్షి మీడియా మాత్రం భూమా అంటేనే స్టేట్ వైడ్ గా వార్తలు ఇస్తున్నారన్నారు. మీరు ఎన్ని జన్మలు ఎత్తిన, మీరు ఎన్ని అవాస్తవాలు రాసినా, ఎన్ని చూపించిన, ప్రజలు ఎప్పుడూ మా వైపే ఉన్నారన్నారు. అటు అధిష్టానానికి, ఇటు ప్రజలకు మాపై నమ్మకం ఉందన్నారు. రమీజా అనే ముస్లిం మహిళపై మీడియా వాళ్ళు ఇష్టమొచ్చినట్లు వార్తలు రాశారన్నారు. ఏఎన్ఆర్ చికెన్ సెంటర్ వాళ్ళు చనిపోయిన కోళ్ల మాంసం ప్రజలకు అమ్ముతు వాళ్ళ ప్రాణాలతో ఆడుకుంటే ఒక ఎమ్మెల్యేగా తాను చూస్తు ఊరుకోమన్నారు. ఈ సందర్భంగా ఏఎన్ఆర్ కోళ్ల గురించి శాంపిల్ ల్యాబ్ ఇచ్చిన సర్టిఫికెట్లు చూపించారు. పిచ్చి పుకార్లు, పిచ్చి వార్తలు దాటుకొని ఈ స్థాయికి వచ్చామన్నారు. కడపలో జరగబోయే మహానాడుకు ఆళ్ళగడ్డ నియోజకవర్గము నుండి భారీ ఎత్తున కార్యకర్తలు, భూమా అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అఖిల ప్రియ పిలుపునిచ్చారు.